


***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ డ్వీపే డాయిచ్ ఖండే
## *చివరి విడత: మలి సందడి (56)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గ్‌లో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ డ్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

### *విమానం ఎక్కబోతూనూ*

ప్రతి మనిషి జీవితానికీ ఓ పరమార్థం ఉంటుంది. అది నెరవేరడానికి సృష్టికర్త మనిషికి ఆయువునిస్తాడు. ఆయువు తీరేదాకా ఆ పరమార్థ సాధనకు కృషి చెయ్యడం మనిషి బాధ్యత. ఎవరైనా ఆత్మహత్యకు తలపడితే– ఆ బాధ్యతను విస్మరించినట్లే! అందుకే చాలామంది ఆత్మహత్యను మహాపాతకం అంటారు. ఐతే దీనికి మరో కోణం కూడా ఉంది.

మనిషి శరీరానికే తప్ప ఆత్మకి చావు లేదు. బ్రతికున్న మనిషి దుస్తులు మార్చినట్లు ఆత్మ శరీరాలు మారుస్తుందని కొందరంటారు. ఐతే మరణం అంటే ఒక జీవితాన్నుంచి మరో జీవితానికి ప్రయాణమన్న భావన కూడా ఉంది. చనిపోయినవాళ్లు స్వర్గానికో నరకానికో పోతారనడం ఈ భావననుంచే పుట్టింది. అదీ ఒక ప్రయాణమే కాబట్టి దానికో ప్రయాణసాధనం అవసరం. మహాభక్తులు కన్ను మూసేక,

వారిని ఊర్ధ్వలోకాలకు తీసుకెళ్లడానికి దేవదూతలు విమానాలు తీసుకొచ్చినట్లు మన పురాణాల్లో చాలా కథలున్నాయి. అదే భావనకు సమకాలీన కథాసాహిత్యంలో శ్రీకారం చుట్టిన ఘనత మహాకథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది.

సుమారు నూరేళ్ల క్రితం ఆయన 'విమానం ఎక్కబోతూనూ' అనే కథ వ్రాశారు.

ఆ కథ బొబ్బిలియుద్ధానికి సంబంధించినది. బొబ్బిలి రాజు రంగారావు తను ఓటమి అంచున ఉన్నట్లు గ్రహించేక– రాణివాసపు స్త్రీలని ఆత్మహత్య చేసుకోమని ఆదేశిస్తూ మహారాణి మల్లమ్మకు కబురంపాడు.

మల్లమ్మ పతివ్రతే కాదు, వీరవనిత కూడా. అవమానకరమైన పరిస్థితి ఏర్పడినప్పుడు పోరాడి చావాలనుకుంటుంది తప్ప ఆత్మహత్య చేసుకొనడం ఆమెకు సుతరామూ ఇష్టం లేదు. కానీ భర్త ఆదేశం ఆత్మహత్యకే పరిమితమవడం ఆమెకు బాధ కలిగించింది. శత్రువుని గాయపర్చాల్సిన కైజారుని తనకుతానుగా తనపైనే ప్రయోగించాల్సిరావడం దౌర్భాగ్యమని వాపోయింది. తను స్త్రీ కాబట్టి, వీరస్వర్గం పొందే అవకాశాన్ని కోల్పోవాలన్న ఆచారాన్ని నిరసించింది. భర్త ఆదేశాన్ని కాదనలేని అసహాయతకు బాధ పడుతూ– తన ప్రాణాలు తనే తీసుకుంది.

ఆత్మహత్యకు ముందు ఆమె మనోభావాల్ని ప్రతిఫలించింది– 'విమానం ఎక్కబోతూనూ' కథ.

సుమారు నూరేళ్లక్రితం ప్రచురితమైన ఈ కథ– మహిళలకు సంబంధించి మనం పాటించే ఆచారాల్ని స్వాభిమాన మహిళల దృష్టికోణంలో విశ్లేషిస్తుంది. ఆలోచనలో, స్పందనలో– ఆ కాలానికి కనీసం నూరేళ్లు ముందున్న కథ ఇది.

ఇప్పుడీ కథ ప్రస్తావన ఎందుకంటే– బెర్లిన్ నుంచి ఫ్రాంక్‌ఫుర్ట్ దాకా ట్రయిన్లో వచ్చిన మేమిప్పుడు మా స్వర్గావరోహణానికి విమానం ఎక్కబోతున్నాం. అప్పటి మా మనోభావాలకిది తగిన శీర్షిక అనిపించింది.

ఇండియాలో ట్రయిన్సు అనూహ్యంగా ఆలస్యం కావడం కద్దు. అలాంటప్పుడు రైల్వే ప్లాట్‌ఫారంమీద మకాం వేసిన సందర్భాలు చాలామందికి సర్వసాధారణం. కొందరు బెడ్డింగులో, దుప్పట్లో పరుచుకుని అక్కడికక్కడే కునుకు తీస్తారు. మేమలా చెయ్యలేక, కూర్చుని జాగారం చేసేవాళ్లం.

ఇప్పుడు ఫ్రాంక్‌ఫుర్ట్ విమానాశ్రయంలో మాకు అలాంటి పరిస్థితే వచ్చింది.

శ్రీమతి పిల్లల ప్రయాణం సాయంత్రం. నా ప్రయాణం మరుసటి దినం.

హొటల్ గది తీసుకుని విశ్రాంతి తీసుకుని నెమ్మదిగా ప్రయాణం కొనసాగించడానికి తగినంత సమయముంది. కానీ మాకున్న సామాను ఎక్కువ.

ట్రయిన్ మమ్మల్ని నేరుగా ఎయిర్‌పోర్టులోనే దింపింది కాబట్టి సామానుతో సహా అక్కడ ప్లాట్‌ఫారంమీదకి తరలించాం. అక్కణ్ణించి సామాను అవసరమైన చోటకి తరలించడానికి ట్రాలీలున్నాయి, ఎస్కలేటర్లున్నాయి.

ఏణ్ణర్థం క్రితం– మొదటిసారి ఈ విమానాశ్రయం చూశాను. అప్పుడు మాతో వచ్చిన డాడ్ చీఫ్ ఫ్రౌ ఇంగా రోవెన్ ఆ విమానాశ్రయంలో 200 గేట్లున్నాయని గొప్పగా చెబితే ఆశ్చర్యంగా విన్నాను. కొత్తగా ఓ ఆధునిక సంపన్న పశ్చిమ దేశంలో అడుగెట్టిన థ్రిల్‌తో పాటు, హనోవర్ వెళ్లే విమానాన్ని క్యాచ్ చెయ్యాలన్న తొందరలో ఈ ప్రదేశాన్ని అంత శ్రద్ధగా చూడలేదు.

తర్వాత మళ్లీ ఇదే రావడం!

ఆ ప్రదేశం విమానాశ్రయంలా లేదు. మహానగరంలో నడి బజారులాగుంది. దుకాణాలు, థియేటర్లు, హొటళ్లు ఉన్నాయి.

సామానంతా ఒకచోట పెట్టుకుని కూర్చున్నాం. తినడానికి పిండి పులిహోర, పెరుగన్నంతో పాటు– పిల్లలకోసం ప్రత్యేకంగా తెచ్చిన బిస్కట్లు, పాల పాకెట్లు కూడా ఉన్నాయి.

ఇలాంటప్పుడు మా పిల్లలు మేం పెట్టింది తినడమే తప్ప ఇది కావాలి, అది కావాలని మారాం చెయ్యకపోవడం మా అదృష్టం.

ముఖప్రక్షాళనం, ఫలహార సేవనం అయ్యేక– శ్రీమతి సామాను దగ్గర కూర్చుంటే, నేను పిల్లల్ని చుట్టుపక్కల తిప్పి చూపించాను. ఆసక్తికరంగా ఉన్న దృశ్యాల్ని ఫొటోలు తీశాను.

ఎయిర్‌పోర్ట్ ఆరేడంతస్తుల భవనం. కారులో వచ్చేవారు ఏ అంతస్తుకా అంతస్తు దగ్గరకు నేరుగా వచ్చి కారు పార్కు చేసుకోవచ్చు. మెలికలు తిరిగి పైకి ఎగబాకిన పెద్ద కొండచిలువలా ఉన్న ఆ కారు పార్కింగ్ ఏరియా చూసి థ్రిల్లయిన నేను– ఉండబట్టలేక నా మనోభావాల్ని పిల్లలతో పంచుకున్నాను. పాపకి కొంత అర్థమైంది కానీ బాబు ఆశ్చర్యంగా విన్నాడు.

పిల్లల్ని వెనక్కి తీసుకొచ్చేక, “ఇంతసేపు పట్టే మాటైతే నలుగురం కలిసి తిరుగుదాం. లేదా కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. చుట్టూ జనాల్ని చూస్తూనే ఇక్కడ కాలక్షేపం చేసేయొచ్చు” అంది శ్రీమతి.

ఒక్కత్తీ కూర్చోవడంవల్ల తనకి బోరు కొట్టిందని అర్థమై, “ఒకచోటే ఎంతసేపని కూర్చుంటాం. సామాను వదిలేసి తిరుగుదాం. మన దేశంలోలా కాదు. ఇక్కడ ఏమీ పోవు” అన్నాను.

“ఇక్కడా పోలీసు స్టేషన్లున్నాయి. జైళ్లున్నాయి. అంటే వాటి అవసరం ఉందనేగా! మన జాగ్రత్త మనం తీసుకుంటేనే– ఎవరైనా మనకు సాయం చెయ్యగలిగేది?” అని శ్రీమతి నన్ను మందలించింది.

“అది సరే కానీ– కూర్చుని మాట్లాడుకునేందుకు కబుర్లేముంటాయ్?” అన్నాను.

“మొదటిసారి మనిద్దరం కలిసి ట్రయిన్లో విశాఖపట్నంనుంచి భువనేశ్వర్ వెడుతున్నప్పుడు చాలాసేపు కూర్చునే కిటికీలోంచి ప్రకృతి దృశ్యాల్నీ, కొత్త కొత్త రైల్వేస్టేషన్లనీ చూశాం. మీరేమో ప్రతి ఊరికీ ఆ పేరెందుకొచ్చిందో అప్పటికప్పుడు కల్పించి కథ చెప్పేవారు. ఆ ప్రయాణం ఎంత బాగుందో!” అంది శ్రీమతి వెంటనే.

నిజంగానే మా జీవితంలో అదొక మధుర సన్నివేశం.

నేను చెబుతున్న కథ అప్పటికప్పుడు కల్పించినదని తెలిసి కూడా– కొత్త స్టేషను వచ్చినప్పుడల్లా కథ అడిగేదామె. పసితనం, చిలిపితనం, అమాయకత్వం, గడుసుతనం, ముచ్చట, కుతూహలం– కలగలిసిన ఆమె ముఖభావాలు– తలచినప్పుడల్లా నిలువెల్లా పరవశుణ్ణి చేస్తాయి నన్ను.

“ఇక్కడ స్టేషన్లూ లేవు. ప్రకృతీ లేదు...” అన్నాను.

“కానీ మనుషులున్నారు. తెల్లవారు, నల్లవారు, యెల్లోవారు– ఇలా రంగురంగులవాళ్లు. అంతా ఎవరి హడావుడిలో వాళ్లుండి పక్కవాళ్లని పట్టించుకోలేని దశలో ఉన్నారు. ప్రతి ఒక్కరికీ ఓ కథ ఉంటుంది....” శ్రీమతి ముఖంలో అప్పుడే అలనాటి భావాలొచ్చేశాయి.

“చెప్పండి నాన్నగారూ” అని పాప అనేదాకా నాకు పిల్లల ఉనికే గుర్తు రాలేదు.

ఇప్పుడు నేను చెప్పే కథలకి ఒకరు కాదు– ముగ్గురు స్పందిస్తారు. ఈ అనుభవం అప్పటికంటే మనోహరం కాగలదనిపించింది.

చుట్టూ చూస్తే– అంతవరకూ మామూలుగా కనిపించిన మనుష్యులు– ఇప్పుడు కథల్లో పాత్రల్లా కనిపించారు.

వాళ్ల కథలు నాకు తెలియవు. కానీ నాకు తోచిన కథ ఆపాదిస్తే– అడిగేదెవరు?

ముందు మాకు దగ్గర్లో నిలబడి సీరియస్‌గా ఏదో చర్చిస్తున్న నడివయసు తెల్ల జంటని ఎన్నుకున్నాను.

వాళ్లు దంపతులో, స్నేహితులో, ఇప్పటికిప్పుడు ఇక్కడ పరిచయమయ్యారో తెలియదు. నేను మాత్రం వాళ్లని దంపతుల్ని చేసేశాను.

“ఆయనకి సినిమా చూడాలనుంది. ఆమెకి చర్చికి వెళ్లాలనుంది” అంటూ మొదలెట్టాను.

ఆయనకి సినిమాలంటే ఎందుకు అభిమానమో చెప్పాలి కదా– అందుకో కథ చెప్పాను. అలాగే ఆమెకు భక్తి ఎందుకొచ్చిందో మరో కథ!

శ్రీమతి ముచ్చటగా వింటోంది. పిల్లలు కుతూహలంగా వింటున్నారు.

"చివరికి వాళ్లు రెండూ వద్దనుకుని, ఏదైనా ఊరికెడదామని ఎయిర్‌పోర్టుకొచ్చారు" అన్నాను.

"ఏ ఊరెడతారు?" అంది పాప కుతూహలంగా.

"అదే తేలక, ఇద్దరూ గొడవ పడుతున్నారు" అన్నాను.

శ్రీమతి కిసుక్కున నవ్వింది. ఆమె నవ్విందని పిల్లలు నవ్వారు.

అంతలోనే ఆ జంట అక్కణ్ణించి కదిలారు. దంపతులు కారేమో మరి– వెళ్లేటప్పుడు చెరోవైపూ వెళ్లారు.

"వాళ్ల గొడవైపోయినట్లుందే– వెళ్లిపోతున్నారు– ఎక్కడికో మరి!" అంది శ్రీమతి.

"చివరికి ఇద్దరూ చెరో ఊరూ వెడదామనుకున్నారు. చెరో ఊరూ వెళ్లే బదులు– ఈ ఊళ్లోనే ఉండి– ఒకరు చర్చికీ, ఒకరు సినిమాకీ వెడితే సరిపోతుందిగా– అని విడిపోయారు" అన్నాను.

ఆశ్చర్యంగా పాపకీ కథ నచ్చడమే కాదు, దూరంగా వెడుతున్న ఇద్దరు చైనావాళ్లని చూపించి వాళ్ల కథ చెప్పమంది.

అలా కథలు చెప్పుకుంటుంటే టైమ్ తెలియలేదు. శ్రీమతి హెచ్చరించి మమ్మల్ని భోజనానికి సిద్ధం చేసింది.

మా భోజనాలయ్యేసరికి వెతుక్కుంటూ మావద్దకొచ్చాడు శ్యామలరావు.

ఆయన్ని చూడగానే శ్రీమతికి వెయ్యేనుగుల బలమొచ్చింది. ఉత్సాహంగా పలకరించింది.

శ్యామలరావు కూడా ఎంతో స్నేహపూర్వకంగా మాట్లాడాడు. ప్రయాణంలో శ్రీమతికి అండగా ఉంటామని ధైర్యం చెప్పాడు.

"లగేజి చెకిన్ చేస్తే ఓ పనైపోతుంది. ఇప్పుడే మా సామాను అక్కడికి చేరవేశాం. మా ఆవిణ్ణక్కడ కూర్చోబెట్టి, నేనిలా వచ్చాను. మీ సామాను కూడా అక్కడికి చేరేద్దాం" అన్నాడు శ్యామలరావు.

ఆయన ఇలాంటి ప్రయాణాల్లో అనుభవజ్ఞుడిలాగున్నాడు. ట్రాలీ తీసుకొస్తే, ఆయన సాయంతో మా సామాను షిఫ్టింగు సులభమైంది.

ఆయనకు థాంక్సు చెప్పాను. ఆయన భార్య శ్రీమతిని ఆప్యాయంగా పలకరించింది. ఇద్దరూ కాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

ఎయిరిండియా లజేజి చెకిన్ వద్ద ఒక నల్లతను, తెల్లతను ఉన్నారు. ఇద్దరూ చెట్టంత మనుషులు. దిట్టంగా ఉన్నారు కానీ లావు కాదు.

మావైతే ఇరవై కేజీలకు అటూ ఇటూ ఉండే సూట్ కేసులు కానీ– అక్కడ మావాటికి డబల్ సైజు సూట్ కేసులు చాలానే ఉన్నాయి. అవి మేము రెండు చేతులూ ఉపయోగించినా పైకి లేపడం కష్టం. వాటినా నల్లతను ఒంటిచేత్తో అవలీలగా ఎత్తుతుంటే– చిటికెన వ్రేలితో గోవర్ధనగిరిని పైకెత్తిన పోతనగారి 'నల్లనివాడు' గుర్తుకొచ్చాడు.

నల్లతను లగేజిని వెయింగ్ మెషీన్‌మీద పెడుతున్నాడు. తెల్లతను రీడింగు చూసి వాటికి లేబుల్సు వేస్తున్నాడు. బరువు పరిమితిని దాటితే అదనపు రుసుము వసూలు చేస్తున్నాడు.

అక్కడే ఓ తెల్లమ్మాయి కూడా ఉంది. ఆమె ప్రయాణీకుల్ని పలకరించి చిన్న చిన్న టిప్సు ఇస్తోంది. ఆమె శ్రీమతిని చూసి స్నేహపూర్వకంగా నవ్వింది. మా పిల్లల్ని చూసి ముచ్చటపడి ఇద్దరికీ చిన్న సైజు చాక్లెట్లు చెరొకటీ ఇచ్చింది.

పెట్టెల బరువు ఎక్కువుంటే అదనపు చార్జి తప్పనిసరి. హ్యాండ్ లగేజిలో మనిషికి 15 కేజీలవరకూ ఉచితం కాబట్టి– పెట్టెల్లో వస్తువుల్ని హ్యాండ్ లగేజికి మార్చుకోమని సలహా ఇచ్చిందామె.

మా సూట్‌కేసుల బరువు ముందుగా చూసుకోమని సలహా ఇచ్చి అందుకు తన వంతు సాయం చేసింది. అన్నీ కూడా ఐదారు కేజీలు ఎక్కువుండడం గమనించి– పిల్లలిద్దరున్నారు కాబట్టి వాళ్లకీ హ్యాండ్ లగేజి అనుమతిస్తారనీ, ఆ సదుపాయం ఉపయోగించుకోమనీ చెప్పింది.

పిల్లలిద్దరికీ బెర్లిన్లో వాడిన చిన్న ట్రాలీలున్నాయి. వాటిని వాళ్లు సులభంగానే లాగుతున్నారు. వాటిలోకి వాళ్లు లాగగలిగినన్నీ, శ్రీమతి హ్యాండ్‌బ్యాగులోకి తను మోయగలిగినన్నీ వస్తువుల్ని తరలించాం.

ఆ తర్వాత కూడా సూట్ కేసుల బరువు రెండు మూడు కేజీలు అదనంగా ఉన్నాయి. ఉసూరు మనిపించినా– వాటికి డబ్బు కట్టడానికి మానసికంగా సిద్ధమయ్యాం.

నల్లతను మా సూట్‌కేసులు నాలుగూ వరుసగా తూకం వేశాడు. తెల్లతను బరువు నోట్ చేసుకున్నాడు. అన్నీ బరువెక్కువే.

చార్జి ఎంత వేస్తాడోనని భయపడ్డాను. కానీ అతడోసారి నావంక చూసి, స్నేహపూర్వకంగా నవ్వి, "ఓకే" అన్నాడు.

ఆ ఓకేతో మాకు– కనీసం ఓ వంద మార్కులైనా కలిసొచ్చింది. అతడికి థాంక్సు చెప్పాను.

హ్యాండ్ లగేజి ఐతే వాళ్లిక బరువు చూడలేదు. చెకిన్ ఐనట్లు లేబుల్సు వేసేశారు.

మావాళ్లకి హ్యాండ్ లగేజి తప్ప మిగతా సామానంతా చెకిన్ ఐపోవడంతో ఎంతో తేలికగా అనిపించింది.

"పిల్లలూ, నేనూ ఈ హ్యాండ్ లగేజితో విమానం ఎక్కగలమా అని భయంగా ఉంది" అంది శ్రీమతి.

"మేమున్నాంగా, మీకేం భయం లేదు" అని శ్యామలరావు వెంటనే అభయహస్తమిచ్చాడు.

అది రాజకీయాల్లో ఎన్నికల వాగ్దానంలాంటిదని అప్పుడు తెలియదు.

ఇక మిగిలింది నా సామాను ఓ సూట్ కేసు, హ్యాండ్ లగేజి.

సూట్‌కేసు బరువు చూసుకుంటే అదనంగా దగ్గర దగ్గర పది కేజీలుంది. శ్రీమతి, నేను హ్యాండ్‌బ్యాగులోకి కొంత బరువు తరలించాం.

హ్యాండ్‌బ్యాగ్ చాలా పెద్దదే కానీ– దాన్ని నేను మొయ్యగలగాలి కదా! అందుకని సూట్‌కేసు బరువు పూర్తిగా తగ్గించలేకపోయాం.

ఆ రెండింటినీ ఎయిర్‌పోర్టులోనే ఓ లాకర్లో పెట్టివచ్చాను.

అప్పటికి శ్యామలరావు లగేజి చెకిన్ మొదలైంది.

శ్యామలరావు మొదటి సూట్ కేసు రెండు కేజీల బరువెక్కువుంది.

తెల్లతను ఏదో అనేలోగానే శ్యామలరావు కలగజేసుకుని, "ఇంటివద్ద హై క్వాలిటీ జర్మన్ వెయింగ్ మెషీన్ మీద తూకం వేశాను. పరిమితికి ఓ కేజీ తక్కువే వచ్చింది. ఇక్కడ మెషీన్లో ఏదో తేడా ఉన్నట్లుంది" అని వాళ్లవంక స్నేహపూర్వకంగా చూసి నవ్వాడు.

ఎయిర్‌పోర్టులో లగేజి విషయంలో సాధారణంగా 2–3 కేజీలకు చూసీ చూడనట్లు ఊరుకుంటారని విన్నాను. ఐతే ఊరుకోకపోతే మనం చెయ్యగలిగింది ఏంలేదని కూడా విన్నాను.

అనుభవజ్ఞుడు కదా– ఎందుకైనా మంచిదని శ్యామలరావు వాళ్ల ముందరికాళ్లకు బంధం కూడా వేస్తున్నాడనుకున్నాను.

కానీ ఆ తెల్లతను ఆయన మాటలు పట్టించుకున్నట్లు లేదు. మొదటి సూట్‌కేసుకి 2 కేజీలు అదనమని వ్రాశాడు. తర్వాత రెండో పెట్టెకి మూడు కేజీలు వ్రాశాడు. వాళ్లిద్దరి హ్యాండ్ లగేజిని కూడా తూకమేసి మరో ఐదు కేజీలు కలిపి, "ఇళ్లలో వాడే మెషీన్సుని మేము పట్టించుకోం. ఎయిర్‌పోర్టులో మెషీనే మాకు ఆధారం" అని మొత్తం పది కేజీలకు చార్జి చేశాడు.

శ్యామలరావు మొహం వివర్ణమైంది.

"మీరు ఒకొక్కరికి ఒకోలా పరిమితి నిర్ణయిస్తారా?" అన్నాడు కోపంగా.

ఆయన బరువు విషయంలో మాకొచ్చిన కన్సెషన్ని ప్రస్తావిస్తున్నాడని అర్థమై క్షణంపాటు భయమేసింది! శ్యామలరావు మా పెట్టెల్ని వెనక్కి రప్పించి మళ్లీ తూకమేయిస్తాడా అని అనుమానం కలిగింది. .

తెల్లతను ఆయనకు సమాధానమివ్వలేదు. “నెక్స్‌ట్” అన్నాడు నల్లతనితో.

నా మనసు తేలిక పడింది.

శ్యామలరావు డబ్బు కట్టేశాడు కానీ బాగా అప్సెట్టయ్యాడు.

నిజానికి నేనూ అప్సెట్టయ్యాను. ఫ్రాంక్‌ఫుర్ట్ నుంచి బొంబాయి వెళ్లడానికి శ్రీమతికి తోడుగా ఉంటానని భరోసా ఇచ్చి, ఎయిర్‌పోర్టులో మాకు చెప్పుకోతగ్గ సాయం చేసిన మనిషి.

ఆయనకిలా అవకుండా ఉంటే బాగుండేదనిపించింది.

శ్యామలరావుకి అదనపు చార్జి పడడం న్యాయమే ఐనా ఆయన ఉక్రోషంలో న్యాయముంది. ఇంచుమించు అదే బరువుకి మాకు ఏ చార్జీ పడలేదు.

కారణమేమిటి?

ఆ సమయంలో తూకం చూసినవాళ్ల మూడ్ బాగుండడమా లేక శ్యామలరావు అతితెలివికి పోయాడా?

కొన్ని ప్రశ్నలకు జవాబులుండవు. అందుకే అదృష్టం అనే పదం పుట్టింది.

అక్కణ్ణించి కదిలేక నేను శ్యామలరావుకి కొన్ని ఓదార్పు మాటలు చెప్పి ఉపశమనం కలిగించాలనుకున్నాను.

గెల్చినవాడు ఓడినవాడిపై చూపించే సానుభూతి ఉపశమనాన్ని కలిగించదు సరికదా ఉక్రోషాన్ని ప్రకోపింపజేస్తుంది. క్రీడాకారులు అందుకు భిన్నం కావచ్చు కానీ– శ్యామలరావు క్రీడాకారుడు కాదు.

అందుకేనేమో– అంతవరకూ స్నేహపూర్వకంగా ఉన్న ఆయన ఉన్నట్లుండి ముభావంగా మారాడు.

“చిన్న పనుంది, మళ్లీ కలుస్తాం” అంటూ భార్యతో సహా అక్కణ్ణించి వెళ్లిపోయారు.

అప్పుడు వాళ్లిద్దరి మొహాలూ చూస్తే– మళ్లీ కలుస్తామా అనిపించింది.

‘విమానంలో శ్రీమతికి కొండంత అండ పోయినట్లే!’ అనుకుని నిట్టూర్చాను.

కొన్ని స్నేహాలంతే!

అవి చెడిపోవడానికి ఇద్దరిలో ఎవరి తప్పూ ఉండనక్కర్లేదు. ఒకరి అదృష్టం చాలు– రెండోవారు దూరం కావడానికి!

కాసేపటికి సెక్యూరిటీ చెక్ సమయమైంది.

శ్రీమతి తన హ్యాండ్‌బ్యాగుని భుజానికి తగిలించుకుంది. ఆ బరువుకామె భుజం కొద్దిగా వంగింది.

పిల్లలిద్దరూ వాళ్ల ట్రాలీల్ని హుషారుగా లాగుతున్నారు. వాళ్ల వయసుకవి బరువెక్కువే ఐనా– ఆ వయసిచ్చిన ఉత్సాహం, కుతూహలం– వాటిని కొంత తేలిక చేశాయి

క్రమంగా వాళ్లు నాకు దూరమౌతుంటే– నా కళ్లు శ్యామలరావుకోసం వెదికాయి. ఎక్కడా జాడ లేదు.

‘సెక్యూరిటీ లోపల మావాళ్లకు తప్పక కనిపించకపోడు’ అనుకున్నాను మనసులో.

దాన్ని ఆశ అనుకుందుకు లేదు– దురాశేనేమో!

వాళ్ల విమానం వెళ్లిపోయింది. ఇక నా ప్రయాణముంది. అది నేడు కాదు. రేపు!

అంటే ఈ రాత్రంతా అక్కడే గడపాలి.

చాలావరకూ సామాను శ్రీమతితో వెళ్లిపోయింది. నా సామాను లాకర్లో ఉంది.

చేతులూపుకుంటూ ఒంటరిగా తిరగడం హాయిగానే ఉంది– మనసులో శ్రీమతి ఒంటరి ప్రయాణం గురించిన బెంగ లేకపోతే!

బెర్లిన్ వచ్చినప్పుడు శ్రీమతి చాలా ఇబ్బందిపడింది. కానీ వెళ్లేటప్పుడు అంత ఇబ్బంది లేదు.

'నేను స్వయంగా విమానం ఎక్కించాను. తను బొంబాయిలో దిగగానే అన్నయ్య రిసీవ్ చేసుకుంటాడు' అని మనసుకి సద్దిచెప్పాను.

ఆ తర్వాత ఎయిర్‌పోర్టులోజరిగిన విశేషాలు కొన్ని జీవితాంతం గుర్తుండిపోయేవే!

వాటిలో ముఖ్యమైనది– విమానాశ్రయంలో రైలు ప్రయాణం.

ఎయిర్‌పోర్టులో ఒకచోటనుంచి ఒకచోటకి వెళ్లడానికి ట్రైన్ సదుపాయముంది. దానికి టికెట్ అవసరం లేదు.

కాలక్షేపానికి ట్రయినెక్కి తదుపరి స్టేషన్లో దిగాను. కాసేపక్కడ తిరిగేక– వచ్చినచోటకి వెళ్లడానికి మళ్లీ ట్రయినెక్కాను.

వచ్చినప్పుడైతే ప్రయాణానికి ఐదు నిముషాలు పట్టింది. తిరిగి వెళ్లడానికి పావుగంట దాటినా స్టేషన్లొస్తున్నాయి కానీ, ట్రైన్ ఆగలేదు.

వచ్చేటప్పుడు కాలాన్నీ, దూరాన్నీ సరిగ్గా అంచనా వెయ్యలేదేమో అనుకున్నాను తప్ప కంగారు పడలేదు. ఐతే అరగంట గడిచినా ట్రైన్. ఐతే అరగంట గడిచినా ట్రైన్ ఆగకుండా ఇంకా ముందుకు పోతుంటే భయమేసింది.

కిటికీలోంచి బయటకు చూస్తే భవంతులు, రోడ్లు కనబడ్డం లేదు. అసలు నగరం ఛాయలే లేవు.

'ఎచటికి పోతావీ రాత్రి?' అన్నారెవరో చెవిలో.

'అవతలి గట్టుకి' అన్న జవాబు మనసులో మెదలగానే– దాన్ని చెవిదాకా చేరకుండా ఆపడానికి కష్టపడ్డాను.

అదృష్టం– మెదడు చురుగ్గా పని చేసింది. ఆ తర్వాత ఒకటి రెండు నిముషాల్లో ఏదో స్టేషన్లో ట్రైన్ ఆగితే చటుక్కున దిగిపోయాను.

అంతే– చలి! మామూలు చలికాదు. జనవరి మొదటి వారపు చలి. నా వంటిమీదున్న ఓవర్‌కోటు ఆ చలిని ఏమాత్రం ఆపడం లేదు.

ఎయిర్‌పోర్టులోనూ ట్రయిన్లోనూ హీటింగ్ ఉండడంవల్ల తెలియలేదు కానీ– రైల్వే ప్లాట్‌ఫారంమీద అలాంటి సదుపాయం లేదు. వణుకుతూనే చుట్టూ చూశాను.

ప్లాట్‌ఫారంమీద జనసంచారం లేదు. దూరంగా ఓ మనిషి కనిపిస్తున్నాడు.

సమీపంలో ఎక్కడా నగరమున్నట్లు లేదు. ఏదో పల్లె శివార్లలో ఉన్నట్లనిపించింది.

అర్థమైంది నాకు. చాలా పెద్ద పొరపాటు చేశాను. అటు వెళ్లాల్సిన ట్రైనుకి బదులు ఇటు వెళ్లే ట్రైనెక్కాను.

తెలియని దేశంలో పరిమిత జ్ఞానంతో తెలియని ట్రయినెక్కాను. అనుకోకుండా ఫ్రాంక్‌ఫర్ట్ నగరం విమానాశ్రయంనుంచి– జర్మన్ గ్రామీణ వాతావరణంలోకి దూసుకొచ్చాను.

అదీ రేపు ఇండియాకు ప్రయాణం పెట్టుకుని!

గుండె దడదడ కొట్టుకుంది.

అంతలో దూరంగా కనిపించిన మనిషి నడక వేగం పెంచి నావద్దకు పరుగున వచ్చాడు. నన్ను చూసి టికెట్ అడిగాడు.

అప్పుడు తెలిసింది– అతడు స్టేషన్ మాస్టరని!

గుండె కొట్టుకునే వేగం పెరిగింది.

నావైపునుంచి ఈ స్టేషనుకి రావడం ఒక తప్పు. ఈ ప్రయాణానికి టికెట్ లేకపోవడం మరో తప్పు!

దేశంకాని దేశంలో టికెట్‌లెస్ ట్రావెల్!

ఈ నేరానికి ఇక్కడ ఎలాంటి శిక్ష ఉంటుంది?

జైలు శిక్షా లేక జరిమానాయా?

జరిమానా ఐతే ఎంత కట్టాల్సి ఉంటుంది?

"టికెట్" అన్నాడు స్టేషన్ మాస్టర్ మళ్లీ.....

'విమానం ఎక్కబోతూనూ' తదుపరి ముచ్చట్లు వచ్చే నెల.....

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments